# కళ్లు లేవుగాని రెక్కలున్నాయి

సుదర్శనానికి కొద్దిగా చదువున్నది. కొంచెంగా ఆస్తి ఉంది. సినిమాల లోనూ, క్రికెట్‌లోనూ మంచి ఆసక్తి ఉన్నది. వాటిలో పాల్గొనాలనే దురాశా లేదు. లేనిపోని పగటి కలలు కనే మనిషి కాడు. అతనికి రెండే ప్రగాఢ వాంఛలు: టిప్‌టాప్‌గా డ్రెస్ చేసుకోవటమూ, ప్రేమించిన అమ్మాయిని పెళ్ళాడ్డమూనూ.

ఇందులో ఒకటి – టిప్ టాప్‌గా డ్రెస్ చేసుకోవటం – ఐదారేళ్లుగా, మీ దయవల్ల తీరుతూనే వస్తున్నది. యంగ్ మెన్స్ కల్చరల్ అసోసియేషన్‌లో రమ్మీ ఆడే పెద్ద మనుషుల నడగండి. "పట్నంలో బెస్ట్ డ్రెస్‌మాన్ యెవరూ?" అని. తడువుకోకుండా సుదర్శనం పేరు చెప్పేస్తారు.

దేవుడు మేలు చేస్తే రెండో పగటికల కూడా ఫలించే సూచనలూ పుష్కలంగా కనిపిస్తున్నాయి. మరీ పుష్కలంగా! – అదే వచ్చిన చిక్కు. ఒక్క వెంకు చాలు, లేదూ, ఒక్క వాణి చాలు. ఇద్దరైపోయారు. ఇద్దరూ ఇద్దరే.

ఒకతె సుదర్శనం వాళ్ళ యింటి దక్షిణపు కిటికీలోంచి చూస్తే వుదయం పూట తమ హాలు గదిలో చదువుకుంటూ కనిపిస్తుంది. అది వెంకు. ఎప్పుడూ తల కొంచెం రేగి వుంటుంది. చెక్కిళ్ళ మీదుగా కాంతి జలపాతంలాగా జారిపోతూ ఉంటుంది. కొద్దిగా ఎమెన్ రాజం టచ్! పెద్ద కళ్ళు. తరుచు ఆ కళ్ళు ఉత్తరం కేసి చూస్తాయి. అప్పుడు వాటిలో జాలీ, ధైర్యమూ, అనుమానమూ కనిపిస్తాయి.

వెంకుకు సుదర్శనం యేనాడో "ఎంకి" అని పేరు పెట్టేశాడు. "ఎంకి వంటి పిల్ల లేదోయ్, లేదోయ్" అనుకునేవాడు. "కళ్ళెత్తితే సాలు కనకాబిసేకాలు" అనుకునేవాడు.

"ఎంకి వొంటి పిల్ల లేదోయ్, లేదోయ్" అన్నది నిజం కాదు. అదే వచ్చిన చిక్కు. వాణి ఉంది. లేకుండా యెలా పోతుందీ? సుదర్శనం వాళ్ళ యింటి ఉత్తరపు కిటికీలోంచి చూడు – రాత్రి పూట; తన బెడ్ రూమ్‌లో ఏదో చేస్తూ కనిపిస్తుంది.

వెంకు ఆర్టయితే, వాణి స్పోర్ట్సు – మన్కడ్ బాటింగ్‌లా వుంటుంది. హజారే బౌలింగ్ లాగుంటుంది. ఆమె కూడా తరుచు దక్షిణంగా తన కళ్ళను ఫైర్ చేస్తూ వుంటుంది. "వాణి నా రాణి" అనుకుంటాడు సుదర్శనం.

"త్రిభుజ ప్రణయం", "ప్రేమ త్రిభుజం" లాంటి మాటలు సుదర్శనానికి చాలా వెగటనిపిస్తాయి. మోడర్న్ లవ్ సిట్యుయేషన్‌కు సంస్కృతం పనికి రాదు. "ఇద్దరమ్మాయిలూ – ఒకబ్బాయీ!" అంటే బాగుంది. "తీన్ తేరా!" అంటే అమంగళం ధ్వనిస్తున్నా, ముక్తసరిగా వుంది.

ఈ యిద్దరిలో యెవరెక్కువో తేల్చేసుకోవటానికి సుదర్శనం తహతహ లాడలేదు. కాళేశ్వరరావుగారైనా ఇద్దరి మెళ్లో పుస్తె కట్టొద్దన్నారుగాని, ఇద్దరు వధువులను చూడవద్దన్నారా? సుదర్శనం ఇరవై ఇద్దర్ని గురించి పగటి కలలు కనదలిచినా చట్టం అతన్ని అడ్డలేదు. అంచేత అతను ప్రస్తుతానికి యిద్దర్నీ ప్రేమిస్తూ పర్యవసానాన్ని కాలానికి విడిచిపెట్టేశాడు.

"నాకేమో యిద్దరూ ఒహటే. వాళ్ళలో యెవరికి నే నంటే యెక్కువ యిష్టమైతే వాళ్ళది ఛాన్సు!" అనుకున్నాడు సుదర్శనం.

అతను కిటికీల్లోంచి పంపే ప్రేమ రాడార్ తరంగాలు అటు వెంకునుంచీ, ఇటు వాణి నుంచీ కూడా బౌన్స్ అయి తిరిగి వస్తూనే ఉన్నాయి. ఇద్దరూ తమ యింటికి వచ్చేవాళ్ళే, తనతో మాట్లాడేవాళ్ళే. కాని యెవరూ గమనించనప్పుడు, దూరమై పోయినట్టుగా ప్రవర్తిస్తారు. అప్పుడు వాళ్ళ చూపులకు "వార్ హెడ్స్" యేర్పడతాయి.

ఎందుకు? ఏమో!

వెంకు అతనితో సినిమాల గురించి మాట్లాడుతుంది. మాట్లాడుతున్నంత సేపూ నవ్వుతూనే ఉంటుంది. ఆ నవ్వు ఏర్ కండిషనింగ్‌లా వుంటుంది.

వాణి స్పోర్ట్స్ గురించి మాట్లాడుతుంది. వాణి నవ్వితే, పిక్చర్‌కు ప్రేక్షకులిచ్చే అప్లాజ్‌లాగుంటుంది.

తన ప్రణయ గాథలో యేర్పడిన అసాధారణ పరిస్థితిని సుదర్శనం చక్కగా గ్రహించాడు. ఒక యంగ్‌మాన్ యిద్దరు గర్ల్సును, లేదూ ముగ్గుర్ని సరదాగా, లేక ఉబుసుపోకు, లవ్ చేసినప్పటికీ అన్నిటికీ సమమైన క్లెయిమ్ వుండటం తటస్థించదు. ఒకతె కొంచెం హెచ్చు బాగుంటే మరొకతె అంత బాగుండదు. ఒకతె హెచ్చు స్నేహం కనబరిస్తే, మరొకతె హెచ్చు ముభావం కనబరుస్తుంది. ఒకతె పెళ్ళాం అయే పోసిబిలిటీ ఉంటే మరొకతెకు ఉండదు.

వెంకు అండ్ వాణీ కేసులో యివేవీ లేవు. ఇద్దరూ పెళ్ళి కావలసిన అమ్మాయిలు. ఇద్దరూ సుదర్శనం శాఖ వాళ్లే – సంఘాన్ని దుమ్మెత్తి పోసి మంచి ఉపన్యాసం దంచే అవకాశం లేదు. ఇద్దరిలో యే ఒకరైనా తనని "గ్లాడ్"గా పెళ్లాడేటట్టే ఉన్నారు.

ఇదే సినిమా కథలోని "లవ్ ట్రయాంగిల్" ఐతే హీరో మధనపడి చచ్చేవాడు.

సినిమా హీరో కాకపోవటం వల్ల సుదర్శనం మథనపళ్ళేదు.  అతను పడే మథనంతా ఒకతెను పెళ్ళాడి రెండోదాన్ని పోగొట్టుకునేటప్పుడు!

వెనకటికి భోజరాజు కాళిదాసు శ్లోకాన్ని, భవభూతి శ్లోకాన్ని త్రాసులో వేసి తూచినట్లుగా సుదర్శనం వెంకునీ, వాణినీ త్రాసులో పెట్టి తూచి యిద్దరూ సమంగా ఉన్నారని తేల్చుకున్నాడు. కాని ఆ త్రాసునే సుదర్శనం తల్లి చేతికిస్తే వాణి వైపు మొగ్గు చూపి వుండేది. కారణం - వాణి తండ్రి తన కాబోయే అల్లుడికి యెక్కువ కట్నం యివ్వగలడు. వెంకు వాళ్ళది కొంచెం తక్కువ స్థితి.

ఆ త్రాసునే సుదర్శనం వాళ్ళ నాన్న చేతికిస్తే వెంకు వేపు మొగ్గు చూపేది. వెంకూ వాళ్ళది పెద్ద స్థితి కాకపోయినా వాళ్ళ వెనక మహా వృక్షం లాంటి మనుషులున్నారు. వెంకు పినతండ్రి రిజర్వు బ్యాంకు డిపార్టుమెంటులో పెద్ద ఉద్యోగి. ఆపిల్ల మేనమామ కూడా ఢిల్లీ సెక్రెటేరియట్‌లో ఏదో పెద్ద హోదా వెలగబెట్టుతున్నాడు. వీళ్లు పెట్టనికోటలు. పెద్ద హోదాల్లో వున్నాం గదా అని పేద చుట్టాలను చిన్న చూపు చూసే రకం కాదు. ప్రతి యేడూ వస్తారు, పది రోజులుండి వెళతారు. వాళ్లు వచ్చినప్పుడు వెంకు వాళ్ళ యిల్లు తిరణాలే. అటువంటి పిల్లను చేసుకుంటే తన కొడుక్కి లాభమని సుదర్శనం తండ్రి నమ్మకం.

తన ప్రేమ గాథ తాలూకు ఆఖరి సీక్వెన్సు యిలాటి చొప్పదంటు కన్సిడరేషన్లపై ఆధారపడి వుంటుందని తెలిసే, సుదర్శనం యిద్దరమ్మాయిలను గురించీ సమంగా పగటి కలలు కన్నాడు. వాళ్ళలో ఎవతె తనకు దక్కకుండా పోయినా తాను డిజప్పాయింట్ కాగూడదు చూడండీ!

తన ప్రణయ రథం యే కుదుపూ లేకుండా పెళ్ళి పందిట్లోకి నడవగలందులకు తీసుకోవలసిన ప్రికాషన్లన్నీ తీసుకున్నప్పటికీ సుదర్శనానికి “జోల్ట్” తగలనే తగిలింది.

మొన్నటి మార్చి 16న వాణి వాళ్ళమ్మ వచ్చి సుదర్శనం వింటుండగానే, “విన్నారా? అమ్మాయికి సంబంధం నిశ్చయమైంది. రేపు తాంబూలాలు పుచ్చుకుంటున్నారు” అన్నది.

వరుడు డాక్టరేట్ సంపాదించుకున్న సైంటిస్టు. అమెరికాలో ఆరేళ్ళు వుండి చదువుకుని వచ్చాడు. యూసిన్ వాళ్ళే రెండు వేలు జీతమిస్తున్నారు.

“కట్నం పది వేలు చాలునన్నాడు. ముష్టి పది వేలు! పిల్ల నచ్చి చేసుకుంటున్నారు గానివ్వండి. ఆ సమ్మంధానికి లక్షలు రావుటండీ!” అన్నది వాణీ వాళ్ళమ్మ.

సుదర్శనం గుండె జారిపోయింది. అతను పడిన జాగ్రత్త అంతా ఏమయిందో తెలియదు. వాణికి సమ్మంధం కుదిరినట్టు తెలియగానే అతను తానింతకాలమూ వాణిపైనే అన్ని ఆశలూ పెట్టుకున్నట్టుగా బాధపడి ఒక్క సారిగా ‘సింక్’ అయిపోయాడు. వాణి

కాబోయే మొగుణ్ణి తిట్టుకున్నాడు. జీతం రాగానే సరా! వట్టి లోఫర్ వెధవా, తాగుబోతూ, ముండల మురాకోరూ, సెఫిలిటిక్కూ, నీగ్రో మొగమూ అయి ఉంటాడు! ఆ వెధవను చేసుకున్నదో వాణి యావజ్జీవితమూ ఏడుస్తుంది. బహుశా, ఈ రాత్రి వాణి ఒంటరిగా తన దగ్గరికి వచ్చి, ఎలాగైనా యీ పెళ్ళి తప్పించమని బతిమాలుతుంది. ఆమెతో లేచిపోయి, ఏ కలకత్తాలోనో రిజిష్టర్డు మేరేజి చేసుకునే ధైర్య సాహసాలు తనకున్నాయా? ధైర్య సాహసాలెలావున్నా, అధమం నాలుగైదు వందలు నగదు కావాలి. తన దగ్గిర లేదు. నాన్న నడిగితే యివ్వడు. వాణి సంబంధం కూడా నాన్నకు యేనాడూ మోజు లేదు.

ఆ రాత్రి సుదర్శనం ఉత్తరపు కిటికీ దగ్గిర పాతుకుపోయాడు. కాని వాణి కనిపించలేదు. ఒక్కసారి బెడ్ రూమ్‌లోకి వచ్చింది గాని దక్షిణంగా చూడనేలేదు. మనిషిలో విషాద విచార ఛ్ఛాయలేమీ లేవు. "డామ్ ఫూల్!" అని తిట్టుకున్నాడు.

మర్నాడు సుదర్శనం డాక్టరు రాధాకృష్ణమూర్తిని స్వయంగా చూశాడు. తాను అనుకొన్నదంతా పొరపాటే. డాక్టరు హాలీవుడ్ సినిమా స్టార్ బాబులాగున్నాడు. పాతిక వేలు ఖరీదు చేసే లెఫ్ట్‌హాండ్ డ్రైవ్ కారులో వచ్చాడు!... అతన్ని చూశాక సుదర్శనం స్పోర్టివ్‌గా తన ఓటమి ఒప్పేసుకున్నాడు. వాణి అతన్ని వదిలేసి తనను పెళ్ళి చేసుకుంటే నిజంగా డామ్‌ఫూలే అవుతుంది!

కాగల పని గంధర్వులే తీర్చారన్నట్టు తనకు వెంకు వుండనే ఉంది. "రాసోరింటికైనా రంగు తెచ్చే పిల్ల నా యెంకి. నా గుండె నమిలి మింగిన పిల్ల!"

తన ప్రణయం ఇప్పుడొక దరి చేరింది. ఇప్పుడు తన ప్రేమనీ, కలల్నీ నిరభ్యంతరంగా వెంకుపైన కేంద్రీకరించవచ్చు!

వెంకుతో వాణి పెళ్ళి గురించి మాట్లాడే నెపం మీద వాళ్ళింటికి వెళ్ళాడు సుదర్శనం. అతన్ని చూడగానే వెంకు వోల్టాస్ మందహాసం ఒకటి పారేసి, లోపలికి వెళ్ళి పొగలు గక్కే కాఫీ తెచ్చి యిచ్చింది.

"తిక్క గరల్ – వాణి" అన్నాడు సుదర్శనం వేళ్ళమీద వూదుకుంటూ.

"అవును, మంచి సమ్మంధం. ఈ పెళ్ళికి ఎంతలేదన్నా పాతిక, ముప్ఫై వేల ఖర్చు జరుగుతుంది" అన్నది వెంకు.

"అయితేమటుకేం? వాణి ఇంకా నా రాణీ" అన్నాడు సుదర్శనం.

"నే నంత రూఢిగా చెప్పలేను. ఒక లెవెల్లో బతకటానికి అలవాటు పడితే అందులో వుండే మజా తెలియకుండా పోతుంది. అంతకుమించిన సుఖాలే కొంటవుతాయి. చూస్తూండండి, వాణి లైఫ్ చాలా అసహజంగా వుండబోతుంది."

మర్యాదకోసం, "ఓ, నో, నో!" అన్నాడు గాని, వెంకు అన్న మాటల్లో కొంత నిజం

లేకపోలేదనీ, రేపు ఆ డాక్టరుతో వాణి పొందే సుఖం కంటె వెంకు తనతో ఎక్కువ సుఖం పొందవచ్చుననీ సుదర్శనం గుర్తించాడు.

"లవ్"కు ముఖ్యమైనదేమిటి? విరామం! విశ్రాంతి! లీజర్! అది తనకు వుండేదాన్లో నూరోవంతు ఆ డాక్టరు కుండదు. వాణికన్న వెంకే అదృష్టవంతురాలని తేలిపోవచ్చు.

"పోనీ, నీకు ఇంతకన్న లక్కీ మాచ్ వస్తుందని హోప్ చేద్దాం!" అంటూ సుదర్శనం వెంకు వద్ద శెలవు తీసుకొని ఇంటికి వచ్చేశాడు.

ఆ మర్నాడు - అంటే మార్చి 18న ఢిల్లీనుంచి వెంకు మేనమామ దిగాడు. వాళ్ళ యింటి ముందు నాలుగు కార్లు వెలిశాయి. ఒక సర్కిల్ ఇన్‌స్పెక్టరు వచ్చి వెళ్ళాడు. ఇంకెవరో ఆఫీసర్లు వచ్చారు, వెళుతున్నారు. ఇల్లు వి.ఐ.పి. క్వార్టర్సు కింద మారిపోయింది.

దక్షిణపు కిటికీ నుంచి చూస్తున్న సుదర్శనానికి రకరకాల దుస్తులవో ఎయిర్ ఫోర్స్ యూనిఫారం కూడా కనిపించింది. "వెంకు మేనమామకు డిఫెన్స్ పోర్టుఫోలియో గాని రాలేదు గదా!" అనుకున్నాడతను.

ఇంతలో వెంకు వాళ్ళింటికి వెళ్ళి వచ్చిన అమ్మ సుదర్శనంతో, "చూశావుట్రా? చక్కని కుర్రాడు! వెంకు అదృష్టవంతురాలు" అన్నది.

సుదర్శనం కొయ్యబారిపోయాడు. అతను ఏమీ అడక్కుండానే తల్లి అంతా చెప్పుకొచ్చింది. వెంకు మేనమామ వెంకుకు సంబంధం తెచ్చాడు. తెచ్చాడేమిటి? వెంట పెట్టుకొచ్చాడు. కుర్రాడికి యిరవై రెండేళ్ళ వయసు. ఎయిర్ ఫోర్స్‌లో కాప్టెన్. కట్నాలు తీసుకోట్ట. పెళ్ళి అంతా పాతిక రూపాయల్లో జరగాలని పట్టు పట్టాడు. వెంకును చూస్తూనే తన యిష్టాన్ని తెలిపాడు!

కొయ్యబారి వున్న సుదర్శనం అదే స్థితిలో వెంకు వాళ్ళింటికి వెళ్ళాడు. కాప్టెన్ కృష్ణారావును చూశాడు. తన ఓటమిని అంగీకరించాడు. వాణ్ణి కాదని తనను చేసుకుంటే వెంకుకన్న "డామ్ ఫూల్" వుండదు!

"కంగ్రాచ్యులేషన్స్, హార్టీ కంగ్రాచ్యులేషన్స్!" అంటూ సుదర్శనం కాప్టెన్ చెయ్యి నొక్కి, వెంకుకేసి ఒక పిచ్చి నవ్వు నవ్వి, యింటికి వచ్చేశాడు.

***ముద్రణ: నవగ్రహకూటం, కథల సంపుటి, 1966-68 మధ్య?***

***జనతా ప్రచురణాలయం, విజయవాడ***